ఖరీదైన కార్లు, అతిఖరీదైన అతిథులు. ఒక పక్క స్పీకర్‌లోంచి విన్పిస్తున్న చాందిని సినిమాలో హిట్ సాంగ్.

గులాబీ గుత్తుల్లో, అత్తరు పరిమళాలు.

లాన్‌లో ఒకపక్క ఎత్తయిన వేదికమీద, ఎర్రరంగు కుర్చీమీద అమెరికా పెళ్ళికొడుకు నిలువెత్తు దండలమధ్య చిరునవ్వులు చిందిస్తూ పెళ్ళికూతురుకోసం ఎదురు చూస్తున్నాడు. నిర్విరామంగా క్లిక్‌మంటున్న కెమేరాలు ..... ఆపైన రిసెప్షన్ మొత్తాన్ని చిత్రీకరిస్తున్న వీడియో కెమెరా .....

అతిథులందరూ పెళ్ళికూతురు ముక్తకోసం ఎదురు చూస్తున్న సమయాన-మెయిన్ హాల్లోంచి మెట్ల మీద కొచ్చింది ముక్త.

ముక్తపక్కన మహతి.

ఆ సమయంలో ముక్త.

మెరుపుతీగల్తో చేసిన చంద్రహారంలా వుంది.

బంగారంతో చేసిన సంపెంగపూల ఆభరణంలా వుంది.

అసలే అందంగావుండే ముక్త-

మహతి స్వయంగా డిజైన్‌చేసిన ఆ డ్రస్‌లో పారిస్ బొమ్మలా వుంది. కొన్నివేల కళ్ళు ముక్తను, దాంతో పాటు ముక్తడ్రస్‌ను కన్నార్పకుండా చూస్తున్నాయి. రిసెప్షన్‌కొచ్చిన అమ్మాయిల కళ్ళన్నీ ఆ డ్రెస్ మీదే వున్నాయి.

"భలేగుందే. ముక్త రిసెప్షన్ డ్రెస్. ఎంత మోడ్రన్‌గా వుందో."

"ఎక్కడిదో ..... "

"అమెరికానుంచొస్తూ వాళ్ళాయన స్పెషల్‌గా తయారు చేయించి తెచ్చుంటాడు."

"వండ్రఫుల్."

"మార్వలెస్."

"ఇండియాలో దొరకవా."

అతిధులు. పరిచయాలు, కానుకలు ..... హడావుడి తగ్గుముఖంపడుతున్న దశలో- ముక్త చుట్టూ అమ్మాయిలందరూ గుమిగూడారు.

అందరూ ఒక్కటే ప్రశ్న .....

ఆ అమ్మాయిల రియాక్షన్స్ గమనిస్తూ ఆ టాక్‌ని వాచ్ చేస్తోంది మహతి.

"బ్రహ్మాండంగా వుందే. నీ రిసెప్షన్ డ్రెస్. మీ హబ్బీ తెచ్చారా."

ఫ్రెండ్స్ ప్రశ్నకు ఉబ్బితబ్బిబ్బయిపోయి, దూరంగా నిల్చున్న మహతి వేపు చూసింది.

"అమెరికాదా, పారిస్‌దా. ఎన్ని జతలు తెప్పించావ్ ..... " ప్రశ్నలవెల్లువ.

"బాబోయ్ నాకేంతెలీదు. ఎక్కడినుంచి తెప్పించిందో నాకు తెలీదు మన మహతి ప్రెజెంట్ చేసింది. దాన్నడగండి."

ముక్త చుట్టూ చేరిన జనం, మహతి వేపురావడానికి అయిదుసెకండ్ల కాలం మాత్రమే పట్టింది.

"అదేం క్లాతే."

"ఆ డిజైనింగ్ ఎక్కడ చేశారే"

“పారిస్సా ..... ”

“అమెరికానా...”

“కాస్ట్ ఎంత.”

“ఇండియాలో ఎక్కడ దొరుకుతాయే. మన హైద్రాబాద్‌లో దొరుకుతాయా” మహతికి గొప్ప ఆనందంగా వుంది.

ఏ టైమ్‌కోసం తను వెయిట్‌చేస్తోందో ఆ టైమ్ వచ్చింది. తన చుట్టూ మూగిన అమ్మాయిలవేపు చూసి-

“ఆ డిటైల్స్ చెప్పాననుకోండి ఏంచేస్తారు” అడిగింది మహతి.

“ఏం చేస్తామా, తలా ఒకడజన్ తెప్పించుకుంటాం” ఓ అమ్మాయి అంది.

“డజనా?” ఎక్సైట్ అవుతూ అంది మహతి.

“ఎస్.” ఇంకో అమ్మాయి అంది ఉద్వేగంగా.

“కష్టం. ఇటీజ్ నాట్ పాజిబుల్. ఎందుకంటే అమెరికన్ డాలర్స్‌లో దాని రేటెంతో తెల్సా అయిదువేల అయిదువందల రూపాయలు. మన ఇండియాలో ఎంతో తెల్సా. ఇంకో రెండువేల రూపాయలు ఎగస్ట్రా అంటే ఏడువేల అయిదువందల రూపాయలు అవుతుంది. ఇప్పుడు చెప్పండి తెప్పించుకుంటారా.”

“ఓ తెప్పించుకుంటాం. ఎడ్రస్ చెప్పు.”

“అది జన్నీక్లాత్ అనీ ఒక వెరైటీక్లాత్ ఇండియాలో దొరకదు. డిజైనింగు, స్టిచ్చింగ్ అంతా పారిస్‌లోనే. సూరత్‌లోని ఓ బిజినెస్ మాన్ ద్వారా కొన్ని డ్రెస్‌లు మాత్రమే తెప్పించాను. ప్రస్తుతం నా దగ్గర ఇంకో నాలుగు డ్రెస్‌లుమాత్రమే వున్నాయి. మీకొలతలిచ్చి, అడ్వాన్స్ యిస్తే, ఒక వీక్‌లో మీకు డ్రెస్‌యిస్తాను. ప్రస్తుతం

నాదగ్గరున్న డ్రెస్ లిమ్మంటే రేపు ముషీరాబాద్ ఏరియాలో వున్న స్టిచ్‌వెల్ టైలరింగ్ సెంటర్‌కొస్తే నేనిస్తాను" చెప్పింది మహతి.

"ఈ క్లాత్‌ని ఏవంటారు మేడమ్." ఒక కుర్రవాడు అడిగాడు.

"జన్నీ క్లాత్ అంటారు"

"ఈ క్లాత్‌ని మగవాళ్ళుకూడా ఉపయోగిస్తారా అలాగే చిల్డ్రన్స్" ఇంకో వ్యక్తి ప్రశ్న వేశాడు.

"ప్రస్తుతం అమెరికాలో లేటెస్ట్ మోడల్ జీన్స్ ఈ జన్నీక్లాత్‌తోనే తయారౌతున్నాయి. పిల్లల రడీమెడ్ డ్రస్సులకూ్కడా అక్కడెంతో గిరాకీవుంది" ఇంకేదో చెప్పబోయి ఆగిపోయింది మహతి.

"మీ ఫోన్ నంబర్ ఇస్తారా మేడమ్."

హేండ్ బ్యాగ్‌లోంచి విజిటింగ్ కార్డు తీసిచ్చింది. మహతి ఒకప్లాన్ ప్రకారం వచ్చిందక్కడకు ఆమె హేండ్‌బ్యాగ్‌లో ఒక విజిటింగ్ కార్డు కూడా మిగలలేదు.

ఆ రోజు రాత్రి మహతికి నిద్రపట్టలేదు.

టీనేజ్ వాయిస్, చిల్డ్రన్స్ కోసం కూడా లేటెస్ట్ డిజైన్స్‌కు రూపకల్పన చేయాలి.

తను అనుకున్నది అనుకున్నట్టుగా జరిగితే ..... తను మధుకర్‌ని గెలుచుకోవచ్చు ..... తనెంతగానో ఇష్టపడే మధుకర్‌ని.

*　　　*　　　*　　　*

ఉదయం సరిగ్గా తొమ్మిదిగంటలు.

స్టిచ్‌వెల్ టైలరింగ్ సెంటర్‌కొచ్చింది మహతి. అప్పటికే వనజాక్షి వచ్చింది.

"మేడమ్ ..... ఈ రోజు నాక్కొన్ని ఫోన్‌లు ..... రావచ్చు ..... ఇంపార్టెంట్ ఫోన్స్ ..... డిస్టర్బెన్స్ అనుకోకుండా, నన్ను పిలుస్తారు కదూ ..... " ముందుగా చెప్పింది మహతి.

"అదేం మాట మహతి ..... " ఆ మాట అంటున్న సమయంలోనే ఫోన్ గణగణమని మోగింది.

"కెన్ వి స్పీక్ టూ మిస్ మహతి ..... "

స్టిచ్‌వెల్ షాపెక్కడుందో చెప్పేసి ఫోన్ పెట్టేసింది మహతి.

మరో అరగంట తర్వాత మరో అయిదు ఫోన్‌లు.

స్టిచ్‌వెల్ షాప్ ఎడ్రస్ కోసం .....

మరో పదినిమిషాలపాటు వరసగా పది ఫోన్‌లు.

"ఏమిటి మహతి, వాట్ ఈజ్ దిస్ ..... ఇన్ని ఫోన్‌లు వస్తున్నాయేంటి ..... వీళ్ళందరూ ఎవరూ ..... " ఆశ్చర్యంగా అడిగింది వనజాక్షి.

"కస్టమర్స్ మేడమ్ ..... "

"కస్టమర్సా ..... " నోరెళ్ళబెట్టింది వనజాక్షి.

ఎవరో రావడంతో బయటకొచ్చింది మహతి. నిన్న రిసెప్షన్‌లో కలిసిన కాలేజీ ఫ్రెండ్స్.

తన దగ్గరున్న నాలుగు డ్రెస్సుల్నీ వాళ్ళ ముందుంచింది. ఎవరికి నచ్చిన డ్రెస్‌ని వాళ్ళు తీసుకున్నారు.

అందరూ హైక్లాస్ ఆడపిల్లలు.

తీసుకున్న డ్రెస్‌కి డబ్బు పే చేసి, మహతి దగ్గరున్న డిజైన్స్‌లో తమకు నచ్చిన డిజైన్‌ని సెలక్ట్ చేసుకుని వాటికి అడ్వాన్స్ ఇచ్చి వెళ్ళిపోయారు. వాళ్ళు వెళ్ళిపోయాక- తన చేతిలో ఉన్న క్యాష్‌ని లెక్కపెట్టింది మహతి.

నాలుగు డ్రెస్‌లకు కలిపి మొత్తం ముప్ఫయివేల రూపాయలు ..... మళ్ళా ఒక్కొక్క డ్రెస్‌కూ ఎడ్వాన్స్ రెండు వేల రూపాయలు ..... అంటే ఎనిమిది వేల రూపాయలు. వనజాక్షి లోన గ్లాస్ రూమ్‌లోంచి ఆ అద్భుతాన్ని చూస్తూనేవుంది ..... ఏం అర్థం కావడంలేదు.

మరో అరగంట గడిచింది.

మరికొంతమంది అబ్బాయిలు, మరికొంతమంది అమ్మాయిలు- మధ్యాహ్నం నాలుగ్గంటలయ్యింది.

ఆడపిల్లలకు, మగవాళ్ళకు కలిపి, పాతిక డ్రెస్సుల ఆర్డర్లున్నాయి. డెలివరీ టైమ్ పదిరోజులని చెప్పింది. అప్పటివరకూ వచ్చిన కలెక్షన్‌ని మరోసారి లెక్క చూసుకుంది. మొత్తం అరవైవేల రూపాయలు.

ప్రవాహంలా జనం రావడం, వెళ్ళడం చూస్తున్న వనజాక్షి టెన్షన్ ఆపుకోలేక, తనకాబిన్‌లోంచి లేచొచ్చేసింది.

"ఏవిటి మహతి ..... ఏవిటది ..... "

"ఏంలేదు మేడమ్ ..... మా ఫ్రెండ్ అమెరికా నుంచి వస్తుందంటే ఒక డ్రెస్ మెటీరియల్‌ని తెప్పించాను. నిన్న ఓ ఫ్రెండ్ మారేజ్ రిసెప్షన్‌లో మిగతా ఫ్రెండ్స్‌కి చూపించాను ..... ఆ అమెరికా మెటీరియల్ తెప్పించమని ..... ఆర్డర్స్ ..... అంతే ....." నవ్వుతూ చెప్పింది మహతి.

"ఆ మెటీరియల్ నాకు చూపించకుండానే నువ్వు బిజినెస్ చేసేస్తున్నావ్ ..... " అంది వనజాక్షి.

"ఐ విల్ షో యూ విత్ ఇన్ టెన్ డేస్ మేడమ్ - బిజినెస్ పని మీద బయటకెళుతున్నాను- నా కోసం ఏమైనా ఫోన్‌లు వస్తే ..... రేపు పది గంటలకు ఫోన్ చెయ్యమని చెప్తారా ..... "

"అలాగే ..... వైనాట్ ..... వెళ్ళు ..... వెళ్ళు" ముచ్చటగా చూస్తూ అంది వనజాక్షి.

అరవైవేల క్యాష్‌ని హేండ్ బేగ్‌లో పెట్టుకుని, రోడ్డుమీదకొచ్చింది మహతి. ఆటో ఎక్కి, గౌలిగూడ బస్టాండ్ కొచ్చింది. ప్లాట్‌ఫారం నెంబర్ త్రీలో ఆగిన భువనగిరి బస్సులో ఎక్కి కూర్చుంది. ఆ బస్సు మరో పది నిమిషాలలో స్టేషన్ నుంచి బయలుదేరింది- ప్రస్తుతం తను అమ్మినది, అమ్మబోయేది మెటీరియల్‌ని కాదు- మానసిక సంతృప్తిని- స్టేటస్‌ని- ఒకసారి నవ్వుకుంది మహతి.

*   *   *   *

రాత్రి పది గంటలు దాటింది.

రద్దీగా ఉన్న పెట్రోల్‌బంక్, అప్పుడే ఖాళీ అయింది. అంత వరకూ అశోక్ కుమార్ హస్కు కొట్టి, అప్పుడే వెళ్ళిపోయాడు. బాయిస్ ఇద్దరూ ఆయిల్ టాంక్ ప్లాట్‌ఫారం మీద కూర్చుని కబుర్లాడుతున్నారు.

అదే సమయంలో--

ఏదో ఢీకొన్న శబ్దం, ఎవరో గట్టిగా అరిచిన అరుపు వినబడడంతో ఆఫీసు రూంలోంచి బయటికొచ్చాడు మధుకర్ . ఏదో కారు పెట్రోల్ బంక్‌లోకి రాబోయి, మలుపులో వున్న ఎలక్ట్రిక్ స్తంభాన్ని ఢీకొంది. ఆ దెబ్బతో, ఆ స్తంభానికున్న ట్యూబ్‌లైట్ పగిలిపోయింది.

రోడ్డు మీద వెళ్ళిపోతున్న ఇద్దరు ముగ్గురుతో పాటు, మధుకర్ కూడా గబగబా కారు దగ్గరకెళ్ళాడు.

"షారీ ..... బాష్ ..... బ్రేక్ ..... పెయిల్ ..... " కారులోని వ్యక్తి నోట్లోంచి మగతగా వచ్చే మాటల కంటే ముందు, మందువాసన ముక్కుపుటాలకు తగులుతోంది.

అది బ్రేక్ ఫెయిల్ కాదు. ఓవర్ డ్రింకింగ్ వల్ల జరిగిందన్న విషయం అతన్ని చూడగానే  తెలుస్తోంది. గేర మార్చడానికే అతను చాలా బాధపడుతున్నాడు. మరికాస్సేపటికి అతను స్టీరింగ్‌మీద మత్తుగా తలవాల్చేసాడు.

“సర్ ..... సర్ ..... ” మధుకర్ పిలిచాడు. ఆ వ్యక్తి ఇప్పట్లో లేవడని అర్థమై-పోయింది మధుకర్‌కి. ఏం చెయ్యాలి. అటూ ఇటూ చూసాడు, మనిషిని కదిపి చూసాడు.

“సర్ ..... మీ రెసిడెన్స్ ఎక్కడ సర్ ..... ” స్పృహలేని స్థితిలో వున్న అతను జేబులోంచి విజిటింగ్ కార్డ్ తీసి, మధుకర్ చేతికి అందిచ్చి పూర్తిగా సీటు మీద వాలిపోయాడు. గబుక్కున ఆ విజిటింగ్ కార్డు చూసాడు మధుకర్ .

సూట్ నెం 401

హోటల్ కృష్ణా ఓబ్రాయ్.

ఏం చెయ్యాలో తోచలేదు మధుకర్‌కి. మరోసారి చుట్టూ చూసాడు ఏం చేద్దాం అన్నట్టుగా పక్కన నిలుచున్న బాయిస్‌వేపు  చూసి--

“ఎవరో పెద్దాయనలా ఉన్నాడు. కృష్ణా ఓబ్రాయిలో ఉంటున్నాడు. అక్కడ డ్రాప్ చేసివస్తాను. ఒక అరగంటలో  వస్తాను. బంక్ చూస్తుండండి ..... ” అన్నాడు మధుకర్ కారు డోర్ తెరుస్తూ.

“అలాగే బాస్ ..... ”అన్నాడు బాయెస్.

మధుకర్ కారెక్కి, స్టీరింగ్ ముందు కూర్చుని, ఇగ్నీషన్ తిప్పాడు.

ఒక చిన్న సంఘటన జీవితంలో పెద్ద మార్పులకు కారణం అవుతోంది ఒక్కోసారి.

బతుకు చౌరస్తాలో ఒంటరిగా నిలబడ్డ సాహసి మధుకర్ జీవితంలోకి, మరొక అధ్యాయం అదృష్టహస్తంలా ప్రవేశిస్తోందని కారుని డ్రైవ్ చేస్తున్న అతనికి తెలీదు.

ఎన్నిసార్లు తనిలాంటి పరిస్థితిలో ఇరుక్కున్నాడు. ఎంతమంది అపరిచిత వ్యక్తులు తనని ట్రాప్ చేశారు ..... ? గతం ఒక్కసారి జ్ఞాపకానికొచ్చింది.

జాలిగా సీటుమీద పడుకుని నిద్రపోతున్న ఆ వ్య క్తి వేపు చూశాడు మధుకర్ .

మరో పావుగంటలో మధుకర్ , హోటల్ కృష్ణా ఒబ్రాయ్‌లో ఉన్నాడు. కారుని పార్క్ చేసి, కారులోని ఆ వ్య క్తిని భుజమ్మీద వేసుకుని, హోటల్లోకి తీసుకొచ్చి, కౌంటర్‌లో ఆయన పేరుని కనుక్కొని, సూట్ నెంబర్ మరోసారి కన్ఫర్మ్ చేసుకుని--

లిఫ్ట్‌లోంచి పైకి తీసుకెళ్ళాడు.

సూట్‌లో, బెడ్‌రూంలో పడుకోబెట్టాడు. ఒక్కసారి నిద్రపోతున్న అతని ముఖం వేపు చూసి, టేబిల్ మీదున్న విజిటింగ్ కార్డ్ తీసాడు.

సుమదేవ్ M. D.,

ADDS INDIA, BOMBAY.

విజిటింగ్ కార్డును మళ్లా టేబిల్ మీద పడేసి, కుర్చీలో కాసేపు కూర్చున్నాడు. అతి కాస్ట్‌లీగా వున్న సూట్లో, ఒక పక్క ఎడ్వర్‌టైజ్‌మెంట్‌కి సంబంధించిన ఎన్నెన్నో బుక్స్ వున్నాయి. మరో పక్క ఏవో కొన్ని ఎల్.పి. రికార్డులు, మరో పక్క కాళీ బాటిల్స్, ఏవో ఇంటర్నేషనల్ మాగజైన్స్.

టేబిల్‌మీద బెడ్‌లైట్, ఆ పక్కనే సగంతెరచివున్న ఓ వి.ఐ.పి. సూట్‌కేసు-- మధుకర్ అటువేపు కదిలి, ఆ సూట్ కేస్ అప్పర్‌భాగాన్ని పైకెత్తి, కనబడిన దృశ్యానికి అవాక్కయిపోయాడు. సూట్‌కేసు నిండా కొంత కరెన్సీ నోట్ల కట్టాలు. ఇంత నిర్లక్ష్యంగా ఎలా వున్నాడో ఈ మనిషి ..... సూట్‌కేస్‌ని క్లోజ్‌చేసేసి, తల పక్కకు తిప్పిచూసాడు.

ఏవో కంపెనీల ఎడ్వర్‌టైజ్‌మెంట్లకు సంబంధించిన స్కెచ్ డిజైన్‌లు, కొన్ని ఆర్ట్ వర్క్స్ పూర్తిచేసుకుని, కేప్షన్స్ కోసం సిద్ధం చేయబడి వున్నాయి.

ఒక్కొక్కటీ తీసి చూస్తున్నాడు మధుకర్ .

మినర్వా వాటర్ హీటర్స్ యాడ్ ఒకటి.

MINARVA SAVES AND SAVES AGAIN,

రెండోది ఏదో హెయిర్ టానిక్యాడ్ ..... మూడోది బ్యాంక్ యాడ్. కేరళలోని ఏదో మారుమూల పల్లె ఆ బ్యాంక్ ఆర్థిక సహాయంతో ఒక మోడల్ టౌన్ షిప్లా తయారైంది.

ఆర్టిస్ట్ వర్క్ బాగున్న, కస్టమర్ని ఆకర్షించడానికి వాటికి రాసిన కేప్షన్స్ మాత్రం, ఏ మాత్రం నచ్చలేదు మధుకర్కి.

అందులో --

అన్ని యాడ్స్కన్నా ఫుల్పేజీ యాడ్కోసం తయారు చేసిన డిజైన్ని చూసాడు మధుకర్ .

అదొక కాటన్ మిల్స్ కోసం తయారు చేయబడిన యాడ్. ఆ మిల్స్ ఇంట్లో గృహిణులు రోజువారీ ఉపయోగించుకోవడం కోసం అతి తక్కువ ధరకు కాటన్ సారీస్ని తయారుచేసింది.

చిత్రంలో--

ఒక మధ్య తరగతి అమ్మాయి, ఇంటిముందు వరండాలో కూర్చుని, జడ వేసుకుంటోంది. ఆమె ఎదురుగా చిన్న అద్దం. ఆ అమ్మాయి రంగు రంగుల కాటన్ చీర కట్టుకుని వుంది.

ఆ యాడ్ కోసం తయారు చేసిన కాప్షన్స్ లిస్టను చూశాడు మధుకర్ . అన్నీ పేలవంగా అనిపించాయి.